# ప్రజాశక్తి

సోమవారం 20 నవంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

### కార్మిక, కర్షక, ప్రజా శ్రేయస్సుకు

# మోడీని గద్దె దింపాలి

**• బిజెపి విధానాలకు నిరసనగా 27, 28 తేదీల్లో మహాధర్నా • రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు**

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి**

కార్మిక, కర్షక, ప్రజా శ్రేయస్సు పట్టని కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో 48 గంటల పాటు విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగే మహాధర్నా గురించి క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి జయప్రదం చేయాలని కోరారు. మహాధర్నాకు సన్నాహకంగా మచిలీపట్నం బుట్టాయిపేటలోని జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో కార్మిక, కర్షక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు కృష్ణాజిల్లా కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి మోడీ ప్రభుత్వం కార్మికులకు చేటు చేసే నాలుగు కోడ్లు తీసుకు వచ్చిందన్నారు. మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా సుదర్ఘీకాలం పాటు ఢిల్లీలో జరిగిన పోరాటం సందర్భంగా రైతాంగానికి మోడీ ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. పంటలకు మద్దతు ధర నిర్ణయించడానికి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. కార్మికులకు, కర్షకులకు ఇచ్చిన హామీలను విస్మరించి దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా అప్పగించడానికి పూనుకుందని, ఈ విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ఎఐటియుసి జిల్లా నాయకులు ఫిలిప్ మాట్లాడుతూ కార్మిక హక్కులకు మోడీ పాలనలో ప్రమాదం ఏర్పడిందన్నారు. ఆంధ్రులు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కుఫ్యాక్టరీని అమ్మడానికి చూస్తోందన్నారు. తెలుగురైతు సంఘం జిల్లా నాయకులు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ రైతాంగం పండించిన పంటలకు కనీస మద్దతు ధర దక్కడం లేదన్నారు. ఆక్వా, గృహ విద్యుత్ వినియోగదారులపైన భారాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఎఐఎఫ్‌టియు న్యూ జిల్లా నాయకులు బి.వెంకటరామయ్య మాట్లాడుతూ ఐక్య పోరాటాలతోనే కార్మిక, కర్షకుల (మిగతా 6లో)

మృతదేహాలను బయటకు తీస్తున్న గజ ఈతగాళ్లు

# ప్రాణాలు తీసిన ఫొటోషూట్

## చెరువులో పడి ఇద్దరు విద్యార్థులు మృతి

**ప్రజాశక్తి-గన్నవరం:** కృష్ణాజిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఫొటోషూట్ ఇద్దరిని బలిగొంది. కాలు జారి చెరువులో పడటంతో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈ ఘటన కృష్ణాజిల్లా గన్నవరం మండలం సావరగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ పటమటకు చెందిన అంకిత్ (15) పదో తరగతి, శశివర్ధన్ (14) తొమ్మిదో తరగతి ఎన్ఎస్ఎం స్కూల్లో చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంలో ఫొటోషూట్ నిమిత్తం సావరగూడెనికి వచ్చారు. ఆ తరువాత మరో నలుగురి స్నేహితులకు ఫోన్ చేసి పిలిపించారు. అనంతరం సావరగూడెం శివరాం కొండ చెరువు వద్దకు చేరుకుని ఒడ్డున నిల్చొని అంకిత్, శశివర్ధన్ ఫొటోలు దిగుతున్నారు. ఈ క్రమంలో పొరపాటున కాలు జారి చెరువులో పడిపోవడంతో ఈత రాక నీట మునిగి చనిపోయారు. మిగిలిన స్నేహితులు పెద్దగా కేకలు వేయడంతో గ్రామంలోని యువకులు చెరువు వద్దకు చేరుకున్నారు. గత ఈతగాళ్ల సహాయంలో ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. కుటుంబ సభ్యులు సావరగూడెం చేరుకోవడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శశి తల్లి భవానీ మాట్లాడుతూ ఆదివారం కావడంతో ఫొటోలు తీసుకుంటానని ఇంటి నుంచి స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడని, చివరకు శవమై తమకు కనిపించాడని కన్నీటి పర్యంతమైంది. గన్నవరం సిఐ కనకారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

# ఉపాధ్యాయులకు సామాజిక స్పృహ ఉండాలి

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- యుటిఎఫ్ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-గుడివాడ**

సామాజిక స్పృహ, సమాజం పట్ల చైతన్యం ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఉండాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ కృష్ణాజిల్లా 48వ నూతన జనరల్ కౌన్సిల్ సమావేశం సమావేశం ఎన్ కృష్ణ సుందర్రావు సభా ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి వారి మనసుల్లో స్థానం సంపాదించి తద్వారా తల్లిదండ్రులకు చేరువ కావాలని సూచించారు. యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌కు మద్దతు ఇచ్చే పార్టీలకు పట్టం కట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పాఠశాలల్లో మతతత్వాన్ని పెంచేందుకు యత్నిస్తుందని, దీనిని తిప్పికొట్టాలని అన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని బొడ్డు నాగేశ్వరరావు, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని కెవి విశ్వమోహన్, యుటిఎఫ్ పతాకాన్ని పూర్వ కార్యదర్శి బి.గోవర్ధన్‌రావు ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదపారుపూడి యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.శేషగిరి, ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ (మిగతా 6లో)

# అటవీ సంరక్షణ చట్టం అమలుకు ప్రణాళిక

## ఎన్‌టిఆర్ జిల్లా డిఎఫ్ఒ అప్పన్న

**ప్రజాశక్తి-విజయవాడ**

అటవీ సంరక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ (డిఎఫ్ఒ) ఎవిఎస్ఆర్‌కె అప్పన్న తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ సంరక్షణ చట్టంలో తీసుకొస్తున్న మార్పులకనుగుణంగా జిల్లాలో అడవుల రక్షణ, వాటి అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. విస్తృతంగా మొక్కలు పెంపకం, జంతువులను కాపాడటం, నిరంతర పర్యవేక్షణ తదితర చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై డిఎఫ్ఒ 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**ప్రశ్న:** అటవీ ప్రాంతం అన్యాక్రాంతం కాకుండా తీసుకుంటున్న చర్యలు?

అటవీ ప్రాంతం అన్యాక్రాంతం (మిగతా 6లో)

# క్రికెట్ సందడి

ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరిగిన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెద్ద స్క్రీన్ ద్వారా క్రికెట్ అభిమానులు మ్యాచ్‌ను తిలకించారు.

## ముందు జాగ్రత్తలతో స్ట్రోక్స్ నియంత్రణ

మాట్లాడుతున్న డాక్టర్ రాజేశ్వరి

**ప్రజాశక్తి - తిరువూరు :** మద్య పానం, ధూమ పానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఎటువంటి మానసిక ఒత్తిడికి గురి గాకుండా, సకాలంలో తగిన పరీక్షలు చేయించుకోవడం వంటి కొన్ని ముందు జాగ్రత్తలతో బ్రెయిన్ స్ట్రోక్స్, హార్ట్ స్ట్రోక్స్ వంటి వాటిని నియంత్రణ చేయవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ రాజేశ్వరి సూచించారు. స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞానవేదిక, యుటిఎఫ్, ఎస్‌విికె సంయుక్త అధ్వర్యంలో వివిధ రకాల స్ట్రోక్స్ నివారణ చర్యలు అనే అంశంపై ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బిపి, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ వి.రవీంద్ర మాట్లాడారు. ఎస్‌విికె బాధ్యులు ఎం.హరికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం ముందు చెత్త వేసి నిరసన

సచివాలయం ముందు వేసిన చెత్త

**ప్రజాశక్తి- నందిగామ** అంబారు పేటలో పారి శు ధ్య కార్మికులకు వేత నాలు రాకపోవ డంతో విధులు బహిష్కరణ చేసి నిరసన తెలిపారు. తడి చెత్త , పొడి చెత్తను విధుల్లో తీసేందుకు పారిశుధ్యం పనులు చేసే కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు లేక పస్తులు ఉంటున్నారు. పనుల్లో రాకుండా విధులు బహిష్కరణ చేశారు. దీంతో గ్రామ ప్రజలు ఇళ్లలోని చెత్తను తీసుకెళ్లి సచివాలయం ముందు పోసి నిరసన వ్యక్తం చేశారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ హనీష్

**ప్రజాశక్తి - నందిగామ :** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల దృష్ట్యా ఆదివారం నందిగామ పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్స్‌కు ఆదివారం సిఐ హనీష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా గొడవలు పడి అవాంఛనీయ సంఘటనలో పాల్గొంటే పీడీ యాక్ట్ పెట్టి నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. కొన్ని సంవత్సరాల నుంచి ఎటువంటి కేసులు లేకపోతే వారిపై ఉన్న షీట్స్ తొలగిస్తామని చెప్పారు. ఎస్సై పండుదొర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతమ్మకు పూల అలంకరణ

**ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు :** కార్తీకమాసం పురస్కరించుకుని స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారు, పరివార దేవతామూర్తులు వివిధ రకాల ప్రత్యేక పూల అలంకరణలో ఆదివారం దర్శన మిచ్చారు. విజయ వాడ బెవరేజ్ కార్పొరేషన్ ఎమ్‌డి దొంతి రెడ్డి, వాసు దేవరెడ్డి, కల్పన దంపతుల సౌజన్యంతో వివిధ రకాల పూలతో అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఇఒ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు ఆదేశాలు మేరకు అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుంటూరు పట్టణం కొరిటపాడుకు చెందిన బోయిన, వాసు శివకుమారి దంపతులు గోసంరక్షణ నిమిత్తం రూ.10 వేలు విరాళమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రకరకాల పూల అలంకరణలో తిరుపతమ్మ

## రోడ్ల అధ్వానంపై టిడిపి, జనసేన నిరసన

భవానీపురం 45వ డివిజన్‌లో నిరసన


గంపలగూడెంలో...

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉమ్మడి ఆదేశాల మేరకు రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రోడ్ల దుస్థితిపై టిడిపి, జనసేన ఉమ్మడి సారధ్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్ కి దారిది కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగ్గయ్యపేట నియోజకవర్గం టిడిపి, జనసేన నేతలతో కలిసి మండలంలోని షేర్ మహమ్మద్ పేట నుండి గండ్రాయి వెళ్లే రహదారిలో గుంతలను తెదేపా, జనసేన పార్టీలో నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ తాము ఇక్కడ ఉన్న అరగంటలోనే రోడ్డు బాగోక ఇద్దరు ముగ్గురు బైక్‌పై నుండి కిందపడ్డారు. టిడిపి వేసిన రోడ్లకు ఈ ప్రభుత్వం కనీసం గుంతలు కూడా పూడ్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కట్టా నరసింహారావు, జనసేన నాయకులు బాడిశా మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **గంపలగూడెం :** టిడిపి, జనసేనల సంయుక్త పోరుతో అధికార పార్టీ కళ్ళు తెరవాలని నాయకులు ఉద్ఘాటించారు. మండల టిడిపి అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి అధ్యక్షతన ఆదివారం స్థానిక కట్లలేరు వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చావల దేవదత్తు పాల్గొని మాట్లాడారు. ఏ గ్రామంలో అంతర్గత రహదారులు చూసినా గుంతలమయమేనని వివరించారు. నేడు వాహనాలే కాదు మనుషులు సైతం నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. జిల్లా టిడిపి రైతు విభాగ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో నిధులన్నీ తాడేపల్లి ప్యాలెస్‌కు తరలిస్తూ ప్రజలను గాలికి వదిలేసినట్లు తెలిపారు. నాలుగేళ్లుగా బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ప్రగల్భాలు పలికిన అధికార పార్టీ ఎంఎల్ఎ ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. వంతెన నిర్మాణానికి శంకుస్థాపన, టెండర్లు అంటూ మండల ప్రజల్ని తప్పుదోవ పట్టించడం తిరువూరు ఎంఎల్ఎ నేర్పుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ వాసం మునయ్య, ఏ కొండూరు మండల పార్టీ అధ్యక్షుడు గడ్డి కష్టారెడ్డి, స్థానిక మండల తెలుగు యువత అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. **భవానీపురం :** జగన్ పాలనలో రాష్ట్రంలోని రోడ్లన్నీ గోతులమయంగా మారాయని టిడిపి పశ్చిమ నాయకులు ఎంఎస్.బేగ్ ఘాటుగా విమర్శించారు. ఆదివారం 45వ డివిజన్‌లోని కబేళ రోడ్డులో గల మదాసు రామారావు వీధి రోడ్డు వద్ద (సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్ద) గతుకుల రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేగ్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో 25 వేల కిలోమీటర్ల మేర రోడ్లు వేయడం జరిగిందని, జగన్ వచ్చాక గుంతల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసాడన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లో రోడ్లు, మెట్లు, రిటైనింగ్ వాల్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, టిడిపి డివిజన్‌ల అధ్యక్షులు పోనుగుపాటి చిన్న సుబ్బయ్య, బీసీ సెల్ కార్య నిర్వాహకార్యదర్శి బూర కనకారావు పాల్గొన్నారు.

## గ్రూప్-2 నూతన సిలబస్‌పై అవగాహన

మాట్లాడుతున్న సుధానంద్

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జగ్గయ్యపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న పట్టణంలోని యస్‌జిఎస్ కాలేజీలో యూజీసీ బ్లాక్‌లో కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుచే గ్రూప్-2 పరీక్షల నూతన సిలబస్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని, గ్రూప్-2 పరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సుకు హాజరైన అభ్యర్థులకు 120 పేజీల గ్రూప్-2 స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జె.సుధానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఏ.నరసింహారావు, కార్యవర్గ సభ్యులు పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న ఉమా

## రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

### మాజీ మంత్రి దేవినేని

**ప్రజాశక్తి - మైలవరం :** రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మైలవరంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు.

## న్యాయ అంశాలపై శిక్షణ

మాట్లాడుతున్న న్యాయమూర్తి బివిఎన్ఎల్ చక్రవర్తి

**ప్రజాశక్తి - విజయవాడ :** లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించుకొని పేదలు, అవసరమైన వారికి న్యాయ సేవలు అందించడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ట్రైనింగ్‌ను నిర్వహించినట్లు న్యాయమూర్తి బివిఎన్ఎల్ చక్రవర్తి తెలిపారు. విజయవాడ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారు ఆదివారం నిర్వహించారు. న్యాయమూర్తి చక్రవర్తి కార్యక్రమాన్ని ప్రారంభించి క్రిమినల్ చట్టాలు, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్, డిఫెన్స్‌లకు అవసరమైన మెలకువలు, నైపుణ్యతను సముపార్జింజుకొని వివిధ చట్టాలను ఆకళింపు చేసుకొని పేదలు, బలహీన వర్గాలకు అత్యుత్తమ న్యాయసేవలు అందించడానికి న్యాయవాదులు అవగాహన కల్గి ఉండాలని కోరారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత సదరు ట్రైనింగ్ ఉద్దేశ్యం, ప్రాముఖ్యను వివరించారు. సీనియర్ న్యాయవాదులు సుంకర రాజేంద్ర ప్రసాద్, యుఎస్ఆర్ రాజు, ఎం.వెంకటేశ్వరరావు, ఎ.హరిహరనాధశర్మ, డైరెక్టర్ ఎపి జ్యుడిషియల్ అకాడమి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ పరిపాలనాధికారి డాక్టర్ హెచ్.అమర రంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

నందిగామలో ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులు

**ప్రజాశక్తి - నందిగామ :** గాంధీ సెంటర్ లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెసరమెల్లి శ్యాంబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కామా శ్రీనివాసరావు, నందిగామ మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ గోపు నరేంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకపుడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 106వ జయంతి సందర్భంగా కొండపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొర్రా కిరణ్ పాల్గొని కొండపల్లి స్టేషన్ సెంటర్‌లో గల ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, జి కొండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెరుకూరి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసు బొమ్మ సెంటర్లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు శీలం రామకృష్ణ మాట్లాడుతూ ఇందిరా గాంధీ తీసుకువచ్చిన విధానాలు నేటికీ కొనసాగుతున్నాయని ఉక్కు మహిళగా పేరుగాంచారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాక్ వన్ అధ్యక్షులు దోసపాటి గిరి కుమార్, పట్టణ అధ్యక్షులు ఎ.దుర్గారావు, మండల పార్టీ అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, జిల్లా మెంబర్ మసను సుధాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. **కంచికచర్ల :** ఇందిరాగాంధీ 106 వ జయంతి వేడుకలు ఆదివారం కంచికచర్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా గల ఇందిరాగాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు మందా వజ్రయ్య, పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. **రెడ్డిగూడెం :** మండల కేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడవర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## 'ఆత్మగౌరవ' పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - మైలవరం :** ఈ నెల 26న నాగార్జున యూనివర్సిటీ సమీపంలో జరగనున్న రజక ఆత్మగౌరవ మహాసభను పురస్కరించుకొని ఆదివారం మైలవరంలో పోస్టర్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా రాష్ట్ర రజక సంఘం అధ్యక్షులు బుద్దారపు వెంకటరావు మాట్లా డుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందితో మహా సభను నిర్వహిస్తున్నామని దీనిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రజకులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఉన్న నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ అధ్యక్షులు తాళ్లూరి శేషగిరి రావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

# దివిసీమ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి : బుద్ధప్రసాద్

మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** దివిసీమలో 1977 నవంబర్ 19న సంభవించిన పెను ఉప్పెన తుఫాను జ్ఞాపకాలు దివిసీమ ప్రజలను నేటికీ భయపెడుతూనే ఉన్నాయని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఉప్పెన మృతుల సంస్కరణ సభ ఆదివారం గాంధీ క్షేత్రంలో నిర్వహించారు ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ విపత్తుల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దివి ప్రాంతాల పరిరక్షణకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉప్పెన సంభవించి 46 సంవత్సరాలు పూర్తయిందని అయితే అది మిగిల్చిన జ్ఞాపకాలు గుర్తులను దివిసీమ పన నిర్మాణంలో కీలక పాత్ర వహించిన మండలి వెంకటకష్ణారావు సేవలను బుద్ధ ప్రసాద్ గుర్తు చేసుకున్నారు. ఉప్పెన బాధితులకు గాంధీ క్షేత్రం ఆవాసంగా మారిందని వేలాది మంది నిరాశ్రయులకు గాంధీ క్షేత్రం ఆశ్రయము కల్పించిందన్నారు. దివి ప్రాంతంలో సముద్రపు కరకట్ట నేడు పూర్తిస్థాయిలో శిధిలమైందని ఎక్కడికక్కడ సముద్ర కట్టకు గండ్లు పడి ప్రమాదకరంగా తయారిందన్నారు. గుల్లలమోద వరకు కరకట్టను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు .విపత్తుల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం ఏటా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని కానీ ఆ నిధులను రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే దెబ్బతిన్న తుఫాన్ షెల్టర్ల స్థానంలో కొత్త షెల్టర్ లో నిర్మించడంతోపాటు వీర గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని బుద్ధ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం అభివద్ధి కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, మాజీ జెడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు, యా సం చిట్టిబాబు బాలానంద పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**ప్రజాశక్తి- పెదపారుపూడి :** మండలంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పెదపారుపూడి తాసిల్దార్ వి నాగభూషణం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు జరుగుతాయి అన్నారు.

## 27న మహాధర్నాను జయప్రదం చేయాలి : సిఐటియు

**ప్రజాశక్తి-పెదపారుపూడి :** బిజెపి ప్రభుత్వ కార్మిక కర్షక సామాన్య ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనంగా నవంబర్ 27 28న విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సి పి రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెదపారుపూడి నవజీవన పబ్లిక్ స్కూల్ స్టడీ సర్కిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఉప్పలపాటి అనూష, టీ సమాధానం, చంటి, పి శిరీష, మహాలక్ష్మి ,విజయ్ కుమారి పాల్గొన్నారు .

## టిడిపి, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం

**ప్రజాశక్తి - గుడివాడ :** జనసేన టిడిపిలో కలిసి పోరాడి అరాచక పాలన అందిస్తున్న జగన్ను గద్దె నుండి దింపుతామని టిడిపి నాయకులు వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బేతవోలులో జనసేన టిడిపిల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూస్థానిక శాసనసభ్యుడు కొడాలి నాని 20 ఏళ్లుగా గుడివాడకు చేసింది శూన్యమన్నారు. జనసేన నాయకులు పాలంకి సారథి, కంచరపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# దివిసీమ ఉప్పెన మృతులకు ఘన నివాళి

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** దివిసీమలో 1977 నవంబర్ 19న సంభవించిన ఉప్పెన జలప్రళయంలో అసువులు బాసిన వేలాదిమంది మృతులను స్మరించుకుంటూ పలు రాజకీయ పార్టీలు వారికి ఘన నివాళులర్పించారు. ఆదివారం మండల పరిధిలోని పులిగడ్డ వద్ద ఉప్పెన మతుల కోసం నిర్మించిన పైలాను వద్ద మృతులకు నివాళులర్పించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రజాప్రతినిధులు వైసిపి నాయకులు పైలాన్ వద్దకు వెళ్లి అక్కడ కొవ్వొత్తులు వెలిగించి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కోకిలగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ అవనిగడ్డ సర్పంచులు దాసరి విజయ్ కుమార్, గోరుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పైలాన్ వద్ద నివాళులర్పిస్తున్న జనసేన, టిడిపి నాయకులు

అదేవిధంగా తెలుగుదేశం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పైలాన్ వద్ద మతులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకష్ణ టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్ రామ్, జనసేన సీనియర్ నాయకులు బచ్చు వెంకట్ నాథ్, మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేష బాబు, టిడిపి నాయకులు బం డే రాఘవ, బాదర్ల లో లక్ష నాయుడు, టిడిపి జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు

# మత్స్యసంపదలో రాష్ట్రం ప్రథమస్థానం : ఎంఎల్ఎ

**ప్రజాశక్తి-కోడూరు :** మత్స్య సంపద విషయంలో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలోని ప్రథమ స్థానంలో ఉందని స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ప్రధానమంత్రి మత్స్యకార సంపాదన యోజన పథకం కింద కోడూరు లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్ ను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్ శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. 13 లక్షల రూపాయలతో 40 శాతం సబ్సిడీతో లబ్ధిదారుడైన కోడూరు కు చెందిన కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ముద్దినేని చందర్రావు ఈ యూనిట్ ను ఏర్పాటు చేశారు. ఎఫ్డిఓ వానపల్లి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మత్స్యకార అభివద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ విశేషంగా కషి చేస్తుందని ఆయన తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులందరికీ పదివేల రూపాయలను లబ్ధిదారులు అకౌంట్లో వేశారన్నారు. రాష్ట్రంలోని మర పడవలు ఉన్న మత్స్యకారులందరికి డీజిల్ లీటర్ కు సంబంధించి 7 రూపాయలను సబ్సిడీ రూపంలో అందించడంతో పాటు, గరిష్టంగా 300 లీటర్ల వరకు కూడా 9 రూపాయల సబ్సిడీపై డీజిల్ ను రాష్ట్ర ప్రభుత్వం మత్యకారులకు అందిస్తుందని ఆయన తెలిపారు. జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఈనెల 21వ తేదీన నాగాయలంకలోని కష్ణా నది ఒడ్డున జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, ఈ సందర్భంగా కోడూరు మండలానికి సంబంధించి పదిమంది ఎస్సీ, ఎస్టీలకు టూవీలర్ విత్ ఐస్ బాక్స్ తో కూడిన ద్విచక్ర వాహనాలను ఉచితంగా అందజేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, మత్స్య శాఖ డివిజనల్ అధికారి ఆర్ ప్రతిభ, మాజీ కే డి సి సి బ్యాంక్ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రమేష్‌బాబు

# రహదారులు బాగు చేయాలని నిరసన

**ప్రజాశక్తి-కోడూరు :** అద్వానంగా ఉన్న కోడూరు రామకష్ణాపురం రహదారిపై టిడిపి జనసేన నేతలు గుంటల ఆంధ్రాకి దారేది అంటూ ఫ్లెక్సీ పట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసహాపతి మండలి బుద్ధ ప్రసాద్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు ఇసుక బుసక అక్రమ రవాణాల వల్లే రహదారులు ధ్వంసం అయ్యాయని ఆరోపించారు. ఈప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి తీర ప్రాంత గ్రామాలకు కనీస దారి వసతి అయినా ఏర్పాటు చేయాలని కోరారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వల్ల కుమార్ రాజు అన్నారు. ఆదివారం పమిడిముక్కల మండలంలోని మంటాడ గ్రామంలో రోడ్ల పరిస్థితులపై ఆయన టిడిపి, జనసేన నాయకులతోకలసి ఆందోళన నిర్వహించారు.మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు మైనేని ఇందిరా, జక్క శ్రీనివాసరావు, అబ్బాస్, కుమ్మర రామారావు, జనసేన నాయకులు తాడిచెట్టు నరేష్ నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** దివిసీమలో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని వెంటనే వాటిని పునర్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ టిడిపి జనసేన పార్టీలు చేపట్టిన గుంతల ఆంధ్రప్రదేశ్ కి దారేది కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని మోదుమూడి గ్రామ రహదారిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకట్రావు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, యా సం చిట్టిబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, బండే రాఘవ బచ్చు రఘునాథ పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఘంటసాల :** వైసీపీ ప్రభుత్వం ప్రధాన రహదారులన్ని డొంకలుగా మారాయని జనసేన నాయకులు, యండకుదురు ఎంపిటిసి సభ్యులు సిద్ధినేని కుమార్ రాజా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లాయి చిట్టూరు వద్ద గుంతలు పడిన రహదారిపై జనసేన, టీడీపీ నాయకులు నిరసన తెలియజేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, టీడీపీ నాయకులు బండి పరాత్పరరావు, అయినపూడి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

**ప్రజాశక్తి -మొవ్వ :** మండల కేంద్రమైన మొవ్వ జేజే నగర్లో ఆదివారం వివాహిత తన ఇంటిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కూచిపూడి ఎస్సై డి సందీప్ తెలిపారు. ఆ దళితవాడలోని ముదునూరి శ్రీనివాసరావు భార్య నాంచారమ్మ (42) ఆర్థిక ఇబ్బందుల మూలంగా ఇంట్లో గల తాటి దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. చనిపోయిన నాంచారమ్మకు భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె కుమారుడు ముదునూరు సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మతి

**ప్రజాశక్తి - గుడివాడ రూరల్ :** రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ టు పసలపూడి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కింద పడి వ్యక్తి మృతి చెందినట్లు, వయసు సుమారు 25 సంవత్సరాలు ఉంటాయన్నారు .మృతుని ఆచూకీ తెలిసిన వారు గుడివాడ రైల్వే పోలీసులకు సమాచారం తెలియజేయాలని కోరారు.

## కోడూరుపాడులో ‘బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ’

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ :రాష్ట్రంలో వైసీపీ అవినీతి, అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు తెలుగుదేశం పార్టీ రాక కోసం ఎదురు చూస్తున్నారని టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, జనసేన అధ్యక్షుడు గరికపాటి నాగబాబు అన్నారు. కోడూరుపాడులో టీడీపీ, జనసేన గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం బాబు షుర్యిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలతో కలసి గ్రామ వీధుల్లో పర్యటిస్తూ టీడీపీ ప్రభుత్వంలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ది చేకూరనుందో తెలియజేసే భవిష్యత్తు గ్యారంటీ బాండ్లను అందజేశారు. మహిళలకు మహాశక్తి పథకం ద్వారా చంద్రబాబు స్వీయ ఆర్థికాభివద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కొండపల్లి వెంకటేశ్వరరావు, గరికపాటి నాగబాబు, ఆర్నేపల్లి సూరిబాబు, పూర్ణచందర్ పాల్గొన్నారు.

## 21న బహిరంగ వేలం పాట

**ప్రజాశక్తి-విజయవాడ:** ఎపిఎస్ఆర్‌టిసి విజయవాడ పార్సిల్ ఆఫీసులో (తీసుకోని) అన్‌క్లైమ్డ్, గుర్తించకపోవడం (అన్ఐడెంట్‌ఫైడ్) పార్సిల్స్‌ను బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి కల్గిన వేలంపాటదారులు బహిరంగ వేలంలో పాల్గొనాలని ఎన్‌టిఆర్-కృష్ణాజిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...పిఎన్ బస్‌స్టేషన్‌లోని పార్సిల్ ఆఫీసులో తీసుకోకుండా, గుర్తించబడని వస్తువులను ఈ నెల 21న మంగళవారం ఉదయం 10 గంటలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ పార్సిల్ ఆఫీసులో వేలం వేస్తామన్నారు.

## చిత్రలేఖనం పోటీలు

**విజయవాడ:** నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా విజయవాడ గుణదల కరెన్సీ నగర్‌లోని దీపానివాస్ బాలుర వసతి గృహంలో ఉన్న బాలలకు ‘సే నో టు డ్రగ్స్’ అనే అంశంపై చిత్రలేఖనం, సందేశాత్మక లఘు చిత్ర నాటిక ప్రదర్శన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ నజ్మ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావం బాలలపై ఎక్కువగా ఉందన్నారు. ముందు జాగ్రత్తతో మాదక ద్రవ్యాల అలవాటుపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావచ్చన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ దేపానివాస్, బాలుర వసతి గృహ ఇంఛార్జి జయరాజు పాల్గొన్నారు.

## గన్నే యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** మండలం కేంద్రంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) యూత్ ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెద్దోడు) ద్వారా 'ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ' స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం నిరుపేదలకు ప్రేమవిందు జరిగింది. పేదలకు గన్నే ప్రసాద్ (అన్న) అండగా ఉంటున్నారని వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వారికి సంస్థ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

## పిల్లల ఎదుగుదలకు పీడియాష్యూర్

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** ప్రముఖ ఆరోగ్య సంరక్షణా కంపెనీ అబాట్ పిల్లల ఎదుగుదల కోసం సరికొత్తగా పీడియాష్యూర్‌ను తీసుకువచ్చినట్లు సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి కెఎస్ఆర్.ప్రసాద్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో నూతన ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు ఎదగడానికి వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి సరైన పోషకాహారం అవసమరని తెలిపారు. విటమిన్ కే2, విటమిన్ డీ,విటమిన్ సి,కేసైన్ ఫాస్ఫోపెప్టైడ్స్ వంటి పదార్థాలతో కలిసి ఉంటుందన్నారు.

## మృతుల కుటుంబాలకు సానుభూతి

**ప్రజాశక్తి - వత్సవాయి :** వత్స వాయి గ్రామానికి చెందిన మాబత్తి హరీష్ తండ్రి మృతి చెందగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ సామినేని ఉదయభాను ఆ కుటుంబాన్ని పరామర్శిం చారు. మక్కపేటకు చెందిన గుడేటి గురుమూర్తి కుమారుడు బైక్ ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబాన్ని సామినేని పరామర్శించారు. ఇరువురి గృహాలకు వెళ్లి వారికి సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, ఆర్.ఎం.పి ఆదిమొలి నాగభూషణం, సర్పంచి గుడ్డేటి సారమ్మ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న సామినేని

## జీవిత బీమా కుటుంబాలకు అండ

**ప్రజాశక్తి వత్సవాయి :** ప్రతి వ్యక్తి జీవిత బీమాతో మమేకమై ఉండాలని జీవిత బీమా డెవలప్మెంట్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని పెనుగంచిప్రోలు గ్రామ పరిధిలో వెంకటప్పయ్య మ్యాంగో గార్డెన్‌లో కార్తీక వనసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎల్ఐసి ఏజెంట్లతో కార్తీక వనసమరాధన నిర్వహించటం చాలా హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా ఉన్నప్పుడే వారి పిల్లలకి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎబిఎస్ ప్రసన్నకుమార్, అజ్మీర్ కోటయ్య, హరి, భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## అంబాపురంలో మదర్సా నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - భవానీపురం :** మాజీ శాసన మండలి సభ్యురాలు మహ్మద్ కరీమున్నీసా జ్ఞాప కార్థం నిర్మించనున్న మదర్సా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శాసన మండలి సభ్యులు మహ్మద్ రుహుల్లా, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అంబా పురంలో ఏర్పాటు చేయ నున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ శాసన సభ్యులు మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మదర్షా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

# పారిశ్రామికవేత్తలు కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** కెఎల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ అవేర్నెస్ ప్రోగ్రాం ఎంఎస్ఎం ఈ ఎంటర్ప్రైడ్ న్యూస్ అండ్ స్టార్టప్ ప్రోగ్రాం ఎపిఐఐసి అసోసియేషన్ బిల్డింగ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐలా చైర్మన్ ఎంవి రామలింగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెంట్రల్ గవర్నమెంట్ పథకాలను ఎంఎస్‌సి ద్వారా ఉపయోగించుకొని వారి వ్యాపార అభివృద్ధిని అంచలంచెలుగా ఎదిగేలా చేసి లాభాలు అర్జించాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. విశాఖపట్నం ఎంఎస్ఎం డిఎఫ్ఒ డివిఎస్ఆర్ మూర్తి విశాఖపట్నం డాక్టర్ రాఘవరావు, కెఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ హ్యూమన్ రైట్స్ ఎమ్‌డి ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ పాల్గొని ఎంఎస్.యమ్మి ఎంటర్‌ప్రైజెస్‌కి స్టార్టప్ కంపెనీస్‌కి ఎంఎస్ఎంఇ లోన్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది ఎంఎస్ఎం పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎం.వి.రామలింగేశ్వరరావు

## నగరంలో కార్ రేసింగ్ కలకలం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** నగరంలో కార్ రేసింగ్ యాక్సిడెంట్ కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. శనివారం అర్ధరాత్రి సమయంలో నగరంలోని గురునానక్‌నగర్‌లో ఖరీదైన కార్లతో రేసింగ్ చేస్తున్న నలుగురు యువతీ యువకులను మాచవరం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వీరిలో కారు నడుపుతున్న వ్యక్తిపైకేసు నమోదుచేసి విచారణ వేగవంతం చేస్తున్నారు. కార్ల రేసింగ్‌లో భాగంగా రమేష్ ఆసుపత్రి జంక్షన్ వద్దకు రాగానే కారు అటుగా వెళ్తున్న స్కూటీని, మరో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. వీరు సమీపంలోని రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్ రేసులు పెట్టుకుని వేగంగా వెళ్తూ బైక్‌లను ఢీకొట్టారని స్థానికులు పోలీసులకు తెలిపినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు రేసింగ్ ఎవరెవరు చేస్తున్నారు, ఎవరైనా ఈ గ్రూపులో ఉన్నారా అనే దానిపై లోతుగా పరిశీలిస్తున్నారు. పోలీసులు మాత్రం కార్ రేసింగ్ కాదని రోడ్డు ప్రమాదమే అని చెపుతున్నారు. ఏది ఏమైనా విచారణ పూర్తి స్థాయిలో జరిగితే గాని వివరాలు తెలియవని స్థానికులు అంటున్నారు.

## వైభవంగా క్రీస్తురాజు మహోత్సవం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** నగరంలోని క్రీస్తురాజపురంలోని క్రీస్తురాజు దేవాలయం విచారణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ మహోత్సవ వేడుకలకు విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీస్తురాజుపురం విచారణ కర్తలు ఫాదర్ మెలుగుమాటి ప్రకాష్, డయోసిసస్ ఎడ్యుకేషన్‌డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, పీఠాధిపతులు జోసఫ్ రాజారావు తదితర గురువులు ఉత్సవాల సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి బిషప్ రాజారావు మాట్లాడుతూ క్రీస్తురాజపురం ప్రజలు 1948 ఫిబ్రవరి 15వ తేదీన మొదటిసారిగా వేడుకలు నిర్వహించారన్నారు.

## డిసెంబర్ 26న కలశ జ్యోతుల ఊరేగింపు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవాలయంలో 2023 భవానీ దీక్షలను పురస్కరించుకొని మార్గశిర శుద్ధ పౌర్ణమి డిసెంబర్ 26వ తేదీ మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు కలశజ్యోతి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారి దేవస్థానం తరపున అధికారికంగా శ్రీ శంగేరీ శారదా వీర మహా సంస్థాన పరిపాలితమైన శ్రీ శివరామ కృష్ణ క్షేత్రం, సత్యనారాయణపురంలో పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ అమ్మవారి రథం సాయంత్రం గం.6.30.లకు ఊరేగింపుగా ఊర్వశి సెంటర్, శైలజా థియేటర్, అలంకార్ సెంటర్, ఏలూరు రోడ్డు, స్వర్ణా ప్యాలెస్, మమతా హోటల్, పోలీస్ కంట్రోల్ రూమ్, ఫ్లై ఓవర్, వినాయక గుడి, రథం సెంటర్, కనకదుర్గానగర్, శ్రీ మల్లిఖార్జున మహా మండపం పక్కన గల పాత మెట్ల మార్గం మీదుగా కొండపైకి చేరుతుంది. భవానీలు తీసుకు వచ్చు జ్యోతులను కనక దుర్గానగర్‌లో దేవస్థానం సిబ్బందిచే స్వీకరించబడునని ఆలయ ఇఒ కెఎస్ రామారావు తెలిపారు. భవానీలు కలశ జ్యోతి ఉత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## అన్నదానం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** స్థానిక కొత్తపేట చేపల మార్కెట్ దగ్గర దూది ఫ్యాక్టరీ సందులో పిళ్ళా నాగలతిక 6వ వర్ధంతి సంద ర్భంగా అన్నదాన కార్యక్రమం శ్రీ లతిక ట్రస్ట్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనం గా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతిన వెంకటేశ్వరరావు, జనసేన నగర అధ్యక్షుడు పోతిన వెంకట మహేష్, టిడిపి నాయకులు ఎంఎస్. బేగ్, కార్పొ రేటర్లు ఉమ్మడి వెంకటేశ్వరరావు, మరుపిళ్ళ రాజేష్, మండేపూడి చటర్జీ, బోయి సత్తిబాబు పాల్గొని పూజ నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ గత 6 సంవత్సరాలుగా శ్రీ లతిక ట్రస్ట్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిళ్ళా నాగ లతిక పేరుతో అనేక సేవ కార్యక్రమాలు చేస్తూ పిళ్ళా నాగ లతిక జయంతి, వర్ధంతిలకు అన్నదానంగా నిర్వహిస్తూ పేదల కడుపు నింపడం చాలా మంచిదని కొనియాడారు. వైసిపి నాయకులు, బిసి నాయకులు, ట్రస్ట్ సభ్యులు పోతిన అచ్యుతరావు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నాయకులు

# కళారంగాల అభివృద్ధికి శ్రీశ్రీ కళావేదిక కృషి

**ప్రజాశక్తి - విజయవాడ :** ఐఎస్ఒ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఆదివారం విజయవాడలో 125వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం స్థానిక మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.విజయబాబు, విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి చైర్పర్సన్ పిళ్ళంగోళ్ళ శ్రీలక్ష్మి మాట్లాడారు. అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ జి.రామచంద్రారెడ్డి, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ నెల నెలా జాతీయస్థాయి కవిసమ్మేళనాలు మాత్రమే కాకుండా లిటరరీ వర్క్‌షాపులు, సెమినార్లు, కరోనా ఫ్రంట్ వర్కర్స్‌కి చేయూతనివ్వడం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 125వ మైలురాయిని సాధించిన సందర్భంగా పి.విజయబాబు, పిళ్ళంగోళ్ళ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, కవి సమ్మేళనాన్ని ప్రారంభించారు. కన్నడ రాష్ట్రం మైసూర్ నుండి విచ్చేసిన ప్రభా శాస్త్రి , కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, నూకా సంపత్, రాష్ట్రప్రతినిధి పార్థసారధి, ఉమ్మడి కష్ణాజిల్లా గౌరవాధ్యక్షులు డావ కే.ఆర్.జి.శేషు కుమార్, రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో అతిథులను సత్కరించారు. అనంతరం కవిసమ్మేళనంలో పాల్గొన్న సుమారు 200 మంది కవులను, సాహిత్యవేత్తలను సత్కరించారు. తదుపరి జాతీయ శతాధిక సమ్మేళనం డిసెంబరులో తాడేపల్లిగూడెంలో 24 గంటలపాటు నిరవధికంగా జరుగనుందని తెలిపారు. ఈ సందర్భంగా కత్తిమండ ప్రతాప్‌ను గజమాలతో సత్కరించారు.

ప్రతాప్‌ను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ధ్వజస్తంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత

## శివాలయ ప్రతిష్ట మహోత్సవం

**ప్రజాశక్తి - మైలవరం :** జి.కొండూరులో శ్రీ పార్వతీ దేవి సమేత అమత లింగేశ్వర స్వామి వార్ల ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

## మహాధర్నాను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - నందిగామ :** నవంబర్ 27, 28న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రైతు, కౌలు రైతు సంఘాల ముఖ్యుల సమావేశం సుందరయ్య భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి.ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 సంవత్సరాల కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయం నిర్లక్ష్యానికి గురై రైతులు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ దేశంలో ఉన్న పెట్టుబడిదారులకు లక్షల కోట్లు రాయితీలిస్తూ పేద ప్రజల మీద భారాలు వేస్తుందని, ఉపాధి హామీ పథకాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. అనంతరం మహాధర్నా కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యర్రా శ్రీనివాసరావు, జంపాన వీర రాఘవయ్య, కౌలు రైతుల సంఘం నాయకులు జి ఏడుకొండలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర సంరక్షణపై అవగాహనా వాక్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** నగరంలోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తాడిగడపలోని ఆసుపత్రిలో నేత్ర సంరక్షణపై అవగాహనా వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనసైయ గంగూలి జెండా ఊపి వాక్‌ను ప్రారంభించారన్నారు. ఈ వాక్‌లో సుమారు 200 మంది పాల్గొన్నారని తెలిపారు. పిల్లల కళ్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చక్కని అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతినెలా నవంబరు 13 నుండి 19వ తేదీ వరకు బాలల నేత్ర సంరక్షణా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగానే అవగాహనా వాక్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఎటువంటి కంటి సమస్యలు వచ్చినా వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అవగాహన వాక్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది

# కోడూరు-అవనిగడ్డ రహదారి ఎప్పటికి పూర్తయేనో....?

- ప్రజాప్రతినిధులు, అధికారులు రోజుకో మాట
- అంకెలగారడీతో మాయ

**ప్రజాశక్తి-కోడూరు** : కోడూరు అవనిగడ్డ రహదారి నిర్మాణంలో అధికారులు ప్రజాప్రతినిధులు అంకెలగారడీతో మాయ చేస్తున్నారు. కోడూరు అవనిగడ్డ ప్రధాన రహదారి ప్రాణ సంకటనగా మారి అనేక ప్రమాదాలకు నిలయంగా మారినప్పటికీ రహదారి నిర్మాణం పై స్పష్టత లేకుండా రోజుకో మాట మారుస్తూ ప్రభుత్వ పెద్దలు, అధికారులు పబ్బం గడుపుకుంటున్నారనటానికి తాజాగా అధికారులు మళ్లీ కోడూరు రోడ్డుకు ప్రతిపాదనలు పంపారని చెప్పటమే ఉదాహరణగా నిలుస్తుంది. మూడేళ్ల కిందట అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హంసలదీవి పర్యటనకు వచ్చి అవనిగడ్డలో విలేకరుల సమావేశంలో 16 కోట్లతో కోడూరు అవనిగడ్డ రహదారి నిర్మాణాన్ని మరో వారం రోజుల్లో ప్రారంభిస్తున్నామని ప్రకటించిన సంగతి అందరికీ విధితమే. ఇక ఏడాది క్రితం స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవనిగడ్డ భారీ బహిరంగ సభలో అవనిగడ్డ కోడూరు రహదారికి 35 కోట్లు నిధులు విడుదల చేస్తున్నామని ప్రకటించిన సంగతి కూడా అందరికీ తెలిసిందే. ముఖ్యమంత్రి హామీ ఇస్తే ఖచ్చితంగా నెరవేరుతుందని మండల ప్రజలు భావించి ఆయన చిత్రపటానికి పాలాభిషేకాలు, పూలతో అభిషేకాలు కూడా నిర్వహించారు. తాజాగా శనివారం జరిగిన కోడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆర్ అండ్ బి అధికారులు మండల ప్రజలకు తేరుకోలేని షాక్ ఇచ్చారు. ఇదిగో రహదారి నిర్మాణాన్ని వారంలో ప్రారంభిస్తామన్న మంత్రి పెద్దిరెడ్డి, 35 కోట్లు ఇచ్చేస్తున్నామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాటలకు విరుద్ధంగా ఆర్ అండ్ బి అధికారులు మళ్లీ కోడూరు రహదారికి ప్రతిపాదనలు పంపామని చెప్పడం ప్రస్తుతం చర్చి నియాంసంగా మారింది. ప్రతిపక్షాలు రహదారి నిర్మాణం కోసం నిరసనలు, దీక్షలో చేపడితే ప్రతిపాదనలు పూర్తి అయి టెండర్లు ప్రక్రియ దశలో ఉండగా, విషయం తెలుసుకొని ప్రతిపక్ష నేతలు కావాలనే రోడ్డు సమస్యపై రాద్ధాంతం చేస్తున్నారన్న నేటి ప్రభుత్వ పాలకులు ఇప్పుడు ఏమి సమాధానం చెప్తారని మండల ప్రజలు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. గతంలో 35 కోట్లతో రహదారి నిర్మిస్తున్నామని పదేపదే చెప్పి ఇప్పుడు 16.5 కోట్లతో రోడ్డు నిర్మాణం కు ప్రతిపాదనలు పంపామని, ఇంకా ఆమోదం ముద్ర కాలేదని అధికారులు తెలపటం మండల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇప్పటికే కోడూరు అవనిగడ్డ రహదారి మీద ప్రయాణం చేయాలంటే నరకయాతనగా మారిందని, ఇదిగో రోడ్డు నిర్మాణం వారంలో, 10 రోజులు ప్రారంభమవుతుందని చెప్పి మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు పంపడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం కాకుండా అత్యంత ముఖ్య సమస్యగా ఉన్న కోడూరు అవనిగడ్డ రహదారి నిర్మాణ విషయంలో అంకెల గ్యారడి మాని, ఇప్పటికైనా నిర్మాణ పనులు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వరి కోతలు ప్రారంభం

**ప్రజాశక్తి -మొవ్వ** : మొవ్వ మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సాగై కోతకు సిద్ధమైన వరి పైరు యంత్రాల ద్వారా కోసి నూర్పించుకొని ఆరుబయట ఖాళీ ప్రదేశాలలో ఆర పెట్టుకోవడంలో రైతులు నిమగ్నమైయ్యారు. మండలంలో సాగైన 26 వేల ఎకరాలలో చెదురుమదురుగా వరి కోతలు సాగుతున్నాయి. అయ్యంకి, పెడసనగల్లు, భట్లపెనుమర్రు గ్రామాలలో ఇప్పుడిప్పుడే సాగుతున్నట్లు ఏవో కంచర్ల శివ ప్రసాద్, ఆయా సచివాలయాల వ్యవసాయ శాఖ సహాయకులు రాజేష్, నపేన్ చక్రవర్తి, ప్రత్యూష తెలిపారు. అలాగే ఈ కేవైసీ చేయించుకున్న రైతులు సైతం తమ ధాన్యం అమ్ముకోవడానికి తమ వద్ద నుంచి దవపత్రాలు తీసుకుంటున్నారని శనివారం వివరించారు

## ఘనంగా కొండాలమ్మ దేవస్థానం వార్షికోత్సవం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద ఆదివారం అమ్మవారి 15వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా జరిగింది. ఉదయం 8 గంటల నుండి అమ్మవారికి వివిధ రకాల పుష్పములతో పుష్పార్చన నిర్వహించి అనంతరం వివిధ రకముల పండ్లు మరియు ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని సుమారు పదివేల మంది భక్తులు దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం గోపి, ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు పాల్గొన్నారు. అమ్మవారికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఈనెల 20వ తేదీ ఉదయం 9 గంటల నుండి డిపార్ట్మెంట్ అధికారుల, మరియు ధర్మకర్తల మండలి సమక్షంలో ఆలయం మండపం లో లెక్కిస్తామని తెలిపారు.

## మళ్లీ వైసిపిదే అధికారం: వంశీ

**ప్రజాశక్తి-గన్నవరం** : రాష్ట్రంలో మళ్లీ జగన్ ప్రభుత్వం రావడం ఖాయమని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. ఆదివారం దావాజీగూడెం దగ్గర ఉన్న గొంది పందామయ్యా సపోటా తోటలో జగనన్న సురక్ష విజయోత్సవ కార్యక్రమం ఎంపీపీ అనగాని రవి ఆధ్వర్యంలో జరిగింది. వంశీ మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు పూర్తిస్థాయిలో లబ్ధి పొందారని, మళ్లీ అధికారంలోకి వస్తే అనేక కార్యక్రమాలు చేపడతారని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసిన నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. గన్నవరం మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు, వైద్యులకు ఆశ వర్కర్లకు వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం అందరికీ వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

## జర్నలిస్టు కుటుంబానికి సాయం

**ప్రజాశక్తి-చల్లపల్లి** : సిటీకేబుల్ విలేకరి కల్లేపల్లి చంద్ర ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకోగా అతని కుటుంబానికి సహాయం స్థానిక విజయ జూనియర్ కళాశాల అధినేత యార్లగడ్డ శివప్రసాద్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని చల్లపల్లి ప్రెస్ క్లబ్ ప్రముఖులు బెల్లంకొండ హరిప్రసాద్ కు ఆదివారం అందచేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పెనుమూడి శ్రీనివాసరావు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర ఉన్నారు.

## 108 సిబ్బందికి సన్మానం

**ప్రజాశక్తి-గన్నవరం** : సహాయ పౌండేషన్ వారు కరోనా కష్టకాలంలో అనేకమందికి ఉత్తమ సేవలందించినటువంటి 108 సిబ్బందికి సహాయ పౌండేషన్ అధ్యక్షులు గాజుల సాంబయ్య నాయుడు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ సేవలందించినటువంటి కష్ణాజిల్లా 108 సిబ్బందిని ప్రతి లొకేషన్ నుంచి ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఎన్నుకొని చేసి ప్రశంస పత్రం శాలువాలు పుష్పగుచ్ఛాలు సన్మానం చేశారు. అందులో భాగంగా మన గన్నవరం 108 సిబ్బంది ఈఎంటి పి నగేష్ పైలట్ ఎం సాయిబాబు ను ప్రశంసా పత్రము శాలువా పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. అరవిందో హెచ్ఆర్ హెడ్ సత్యనారాయణ, జోనల్ ఆఫీసర్ శివ రాకేష్, కష్ణాజిల్లా డిఎం ఎన్ హరీష్ రెడ్డి, కష్ణ జిల్లా ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ బి ప్రశాంత్, పాల్గొన్నారు

సాయం అందిస్తున్న దృశ్యం

## బాధితునికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-మోపిదేవి** : శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం అందించారు. మోపిదేవి మండల పరిధిలోని నాగాయతిప్ప గ్రామ పంచాయతీలో గల పోచిగానిలంక కు చెందిన రేపల్లె వెంకట పున్నయ్య కు శ్యామ్ కిషోర్ ఆదివారం రూ. 7 వేల రూపాయల నగదును అందజేశారు. వెంకట పున్నయ్యకు నెల రోజుల క్రితం పక్షవాతం రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురై మంచంలో నుంచి లేవలేని పరిస్థితులలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న శ్యామ్ కిషోర్ తన వంతు సాయాన్ని అందించారు. రంగస్థలం కళాకారులు పుప్పాల వీరాంజనేయులు ఈ సందర్భంగా శ్యామ్ కిషోర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గరికిపాటి వీరాంజనేయులు, గరికిపాటి నాగబాబు, పుప్పాల రాఘవయ్య, రేపల్లె కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## సౌధారాణి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

**ప్రజాశక్తి-ఉయ్యూరు** : అంగన్వాడి కార్యకర్త ముళ్ళపూడి సౌధా రాణి కుటుంబానికి 10 లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని అంగన్వాడి జిల్లా కమిటీ కార్యదర్శి ఏ రమాదేవి అన్నారు. ఆదివారం అంగన్వాడి కంకిపాడు ప్రాజెక్టు అంగన్వాడీ కార్యకర్తల సమావేశం లో ఆమె మాట్లాడుతూ సౌదా రాణి కుటుంబానికి న్యాయం చేయాలని అంగన్వాడి కార్యకర్తలు తమ ప్రాంతాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చదువు చెప్పడం బాలబాలికలను క్రమశిక్షణతో తయారు చేయడంలో అంగన్వాడీ వర్కర్లు కీలకపాత్ర వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు అంగన్వాడీ కార్యకర్తలను చిన్నచూపు చూసి వీరికి కనీస వేతనాలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఈఎస్ఐ వంటి సంక్షేమ ఫలాలు అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందారని ఆరోపించారు. సౌదా రాణి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని కోరారు. అంగన్వాడీ వర్కర్స్ నాయకులు కనకరత్నం ఇందిరా, పద్మ సౌభాగ్యం భారతి జిల్లా సిఐటియు నాయకులు చౌటుపల్లి రవిబాబు మండల కార్యదర్శిలు త్రిమూర్తులు, తాడంకి నరేష్, సజ్జ బాల గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్, బి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎ. రమాదేవి

## 30 గంటల దీక్షను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - మొవ్వ** : కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్, కరువు సమస్యలపై సోమ, మంగళవారాల్లో సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ లో 30 గంటలపాటు నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయడానికి పార్టీ సభ్యులు సమాయత్తమ అవ్వాలని పామర్రు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మొవ్వ మండలం కోసూరులో కష్ణాజిల్లా ప్రజానాట్యమండలి కన్వీనర్ కోసూరు వెంకట అప్పారావు ఇంటి వద్ద ఆదివారం గోడపత్రికలను విడుదల చేశారు. ఆయనతో పాటు నియోజకవర్గ సహాయ కార్యదర్శులు చందోలు నాగేశ్వరరావు, కె.వి అప్పారావు, శాఖ కార్యదర్శులు కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజుకు జాతీయ క్రీడా పోటీలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో జరుగుతున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి విచ్చేసిన వివిధ ఇంజనీరింగ్ కళాశాలల క్రీడాకారులు పురుష మరియు మహిళ విభాగాల్లో వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖో-ఖో, కబడ్డీ, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ ఆటల్లో తమ ప్రతిభ మరియు నైపుణ్యాలను కనబరుస్తున్న లీగ్ దశ పోటీలు హెూరాహెూరీగా సాగుతున్నాయి. పురుషుల విభాగంలో వాలీబాల్ కు 27, బాస్కెట్ బాల్‌కు 11, ఖో-ఖో కు 8, కబడ్డీ కు 33, రోప్ స్కిప్పింగ్ కు 3, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ కు 2 టీం లు, డబుల్స్ కు 3 టీంలు, మహిళల విభాగంలో వాలీబాల్ కు 6, బాస్కెట్ బాల్ కు 5, ఖో-ఖో కు 3, కబడ్డీ కు 2, రోప్ స్కిప్పింగ్ కు 7, టేబుల్ టెన్నిస్ డబుల్స్ కు 3 టీం లు పాల్గొన్నాయన్నారు. అథ్లెటిక్స్ లో పురుషుల వ్యక్తిగత విభాగంలో 100 మీటర్ల పరుగుకు 22 మంది. 400 మీటర్ల పరుగు కు 27 మంది, 1500 మీటర్ల పరుగు కు 14 మంది, లాంగ్ జంప్ కు 21 మంది, ట్రిపుల్ జంప్ కు 8 మంది, షాట్ పుట్ కు 17 మంది, డిస్క్ త్రో కు 13 మంది పాల్గొన్నారన్నారు. మహిళల వ్యక్తిగత విభాగంలో 100 మీటర్ల పరుగు కు 5గురు, 400 మీటర్ల పరుగు కు 4గురు, 1500 మీటర్ల పరుగు కు 6గురు, లాంగ్ జంప్ కు 5గురు, ట్రిపుల్ జంప్ కు ఇద్దరు, షాట్ పుట్ కు 9 మంది, డిస్క్ త్రో కు 5గురు మరియు బంద విభాగంలో 400ఐ100 రిలే లో పురుషుల విభాగంలో 24 టీం లు, మహిళల విభాగంలో 8 టీం లు పాల్గొనినట్లు రజతోత్సవ వేడుకల జాతీయ స్థాయి క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివ శంకర్ తెలిపారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన మరియు రవాణా సౌకర్యాలను కల్పించడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్సను అందజేయుటకు గుడ్లవల్లేరు గ్రామ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సహకారంతో వైద్య సదుపాయాన్ని కూడా అందుబాటులో ఉంచామని జాతీయ స్థాయి క్రీడా పోటీల కో ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు తెలిపారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఆటల పోటీలలో ఆడి భౌతికంగా అలసిన క్రీడాకారులకు ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని నింపేందుకు కళాశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను, క్యాంప్ ఫైర్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఎస్.ఎస్.ఆర్.వి. ప్రసాద్ తెలిపారు. క్రీడల విభాగంలో ఫలితాలు ఇంకనూ తెలియవలసి ఉందని అన్నారు.

## మొదటిపేజీ తరువాయి

### అటవీ సంరక్షణ చట్టం అమలుకు ప్రణాళిక

కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. విలువైన కలప అక్రమ రవాణా నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే జంతువులు, వివిధ రకాల పక్షులను కాపాడటానికి రేంజ్ ఆఫీసర్లు, దిగువ స్థాయి అధికారులు, ఉద్యోగులు నిరంతరం నిఘా పెంచడం జరుగుతుందన్నారు.

**ప్రశ్న:** అటవీ సంరక్షణ చట్టం అమలు తీరు ఎలా ఉంది?

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన అటవీ సంరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేస్తున్నాం. దాని ఆధారంగా పలు రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అటవీ ప్రాంతంలో భూములు, ఇతర కలప ఎటువంటి అక్రమాలు, అన్యాక్రాంతం కాకుండా అటవీ చుట్టూ గస్తీని పెంచి గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

**ప్రశ్న:** జిల్లాలో విస్తరించిన ఫారెస్ట్ భూమి ఎంత?

జిల్లా వ్యాప్తంగా 85 వేల హెక్టార్స్‌లో ఫారెస్ట్ భూములు విస్తరించి ఉంది. జిల్లా పరిధిలోని తిరువూరు, ఇబ్రహీంపట్నం, వారధి తదితర ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచి విలువైన అటవీ కలప అక్రమ రవాణా జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

**ప్రశ్న:** అటవీ భూములపై ఆధారపడి ఎన్ని గిరిజన కుటుంబాలు జీవిస్తున్నారు?

నూజివీడు, మైలవరం తదితర ఏరియాల్లో పలు గిరిజనులు సుమారు 325 హెక్టార్స్ పరిధిలోని అటవీ భూములను రైట్స్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్ఒఎఫ్ఆర్) ప్రకారం గత మూడు-నాలుగు దశాబ్దాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ ఫలసాయాన్ని పొందుతున్నారు.

**ప్రశ్న:** మొక్కల పెంపకం ఎలా జరుగుతుంది?

ప్రతి ఏటా మొక్కలు పెంచుతున్నట్లుగానే గత ఏడాది లక్ష్యానికి మించి ఈ ఏడాది కూడా 60 హెక్టార్లకు పైగా 12 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించాం. దానికనుగుణంగా ప్రస్తుతం వర్క్ జరుగుతుందన్నారు.

**ప్రశ్న:**వన సంరక్షణా సమితుల పని విధానం ఎలా జరుగుతుంది?

అటవీప్రాంతంలో ఉంటూ, అదే జీవనాధారంగా చేసుకొని చట్ట ప్రకారం లభించిన హక్కు ప్రకారం కలప, ఇతర ఉత్పత్తులను విక్రయించుకోవడం ద్వారా గిరిజనులకు కొంత రాబడి వస్తుంటుంది. అటవీ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు ఎంత మంది ఉంటే అందరూ విఎస్ఎస్‌లో చేరి, అటవీ సంరక్షణ, మొక్కలు పెంపకం, వాటర్ నిల్వ చేసే చర్యలు వంటి పనులు చేయాలి. అయితే వనసంరక్షణా సమితులు (విఎస్ఎస్) చెట్లు పెంచి, వాటిని విక్రయించడం ద్వారా కాంపౌండ్ ఫీజురూపంలో వసూలు చేయాలి. ఈ ఏడాది కాంపౌండ్ ఫీజు రూ. మూడు కోట్లు వరకు వసూలు చేయాలని టార్గెట్ విధించడం జరిగింది. అదే గత ఏడాది నిర్ణయించిన రూ. 80 లక్షలు మాత్రమే ఫీజు వసూలు జరిగింది. ఎక్కువగా మారుజాతి, టేకు, వేప, మామిడి, నిద్రగన్నేరు, రోజ్‌హుడ్ తదితర రకాలకు చెందిన వృక్ష జాతి అటవీప్రాంతంలో ఉన్నాయని అన్నారు.

**ప్రశ్న:** రన్నింగ్‌లో ఉన్న విఎస్ఎస్‌లు ఎన్ని?

గతంలో ఈ జిల్లా పరిధిలో 66 వనసంరక్షణా సమితులు (విఎస్ఎస్) బాగా రన్నింగ్‌లో ఉండేవని, కానీ ప్రస్తుతం కేవలం ఎనిమిది మాత్రమే బాగా పనిలో ఉన్నాయని అన్నారు. కొత్తూరుతాడేపల్లి, మైలవరం, విసన్నపేట, ఏ కొండూరు, జి కొండూరు, కొండపల్లి తదితర ప్రాంతాల్లో విఎస్ఎస్‌లు ఉండేవని, ప్రస్తుతం కొన్ని మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయన్నారు. అటవీ ప్రాంతంలో ప్రతి ఏటా మొక్కలు పెంపకం, వాటర్ నిల్వ ఉండేటట్లు ట్యాంకల ఏర్పాటు తదితర పనులను విఎస్ఎస్ చేత చేయించడంజరుగుతుందన్నారు.

**ప్రశ్న:** పక్షులు, జంతువుల సంరక్షణకు తీసుకునే చర్యలు?

చాలా రకాల పక్షులు, అటవీ జంతువులు అపహరణకు గురికాకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. రకరకాల పక్షులు, జంతువులున్నాయి. ఎంతో విలువైన ఈ సంపదను సంరక్షించాల్సి ఉంటుంది. వాటిని కూడా సంరక్షిస్తూనే, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

# ఉత్సాహంగా విజయవాడ మారథాన్

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్**

అంతర్జాతీయ క్రీడాంశాల్లో ప్రసిద్ధి పొందిన క్రీడాకారులకు నిలయమైన ఎన్‌టిఆర్ జిల్లాను మారథాన్ నిర్వహణలో ప్రపంచ పటంలో నిలిపేందుకు విజయవాడ రన్నర్స్ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. విజయవాడ రన్నర్స్ ఆధ్వర్యంలో 8వ విజయవాడ మారథాన్ ను ఆదివారం గాంధీనగర్‌లోని జింఖానా మైదానంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మారథాన్ అంటే ఆఫ్రికా దేశాలే గుర్తుకొస్తాయన్నారు. విజయవాడలో కూడా మారథాన్ పట్ల ఆసక్తి కలిగిన యువతీ యువకులు, అంతే స్థాయిలో 60 సంవత్సరాలు పైబడిన వారు కూడా పాల్గొనడం చూస్తుంటే సమాజంలో ఆరోగ్యం పట్ల పెరుగుతున్న అవగాహనే కారణమన్నారు. సహనం, ఓర్పు, మానసిక దృఢత్వం, శారీరక పటుత్వం పెరగడంతో పాటు మరెన్నో వ్యాధుల నివారణకు పరుగు ఉచిత ఔషధమన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా బరువు తగ్గటం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, ఎముకలు, కండరాలు దఢంగా తయారు చేసుకోవడం వంటి ఎన్నో అంశాలు ఈ పరుగు ద్వారా మనం పొందవచ్చన్నారు. హృదయ సంబంధ, అల్జీమర్స్ వంటి వ్యాధులను నిరోధించేందుకు ప్రతిరోజు కనీసం ఒక కిలోమీటర్ నడక అలవాటు చేసుకోవాలన్నారు. విజయవాడ రన్నర్స్ నిర్వహణలో దేశంలోని 11 రాష్ట్రాల నుంచి రెండు వేల మందికి పైగా రన్నర్స్ పాల్గొనడం గర్వకారణమన్నారు. విజయవాడలో ఇప్పటికే చదరంగం, విలువిద్య, హాకీ క్రీడలలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన క్రీడాకారులు ఉన్నారని గుర్తు చేశారు. ఇదే కోవలో మారథాన్‌లో కూడా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారు కావాలన్నారు. ఇటీవల కాలంలో విజయవాడ కేంద్రంగా ఎన్నో క్రీడా కార్యకలాపాలు ప్రభుత్వ, ప్రైవేటు క్రీడా అకాడమీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. విజయవాడ రన్నర్స్ నిర్వాహకులు మణి దీపక్ మాట్లాడుతూ గత ఏడు సమత్సరాలుగా మారథాన్ నిర్వహించామని ఎనిమిదవ మారథాన్ కూడా ఘనంగా నిర్వహించామని తెలిపారు. విజయవాడ వాసులకు ఆరోగ్యంతో పాటు, ప్రతి రోజూ నడక అలవటుచేసుకోవలనే ఉద్దేశంతోనే మారథాన్ నిర్వహిస్తున్నామని అన్నారు. మారథాన్ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా పోలీస్ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విజేతలకు కలెక్టర్ జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. 21 కె రన్‌లో రమేష్ చంద్ర, సాయి సాహు, బ్రహ్మ రెడ్డి, 10 కె రన్‌లో ఎం.భాను, పాని 34.31 నిమిషాలు, రమేష్, 5కె రన్‌లో సాయి రామ్, సుధీర్, జె.బాబు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఈ.నాగేంద్ర, శ్రీరామ్ చిట్స్ లిమిటెడ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.చౌదరి, విజయవాడ రన్నర్స్ వైస్ ప్రెసిడెంట్ వేముల పార్థ, సెక్రటరీ బాబీ తదితరులు పాల్గొన్నారు.

మారథాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

యుటిఎఫ్ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గం

## ఉపాధ్యాయులకు సామాజిక స్పృహ ఉండాలి

సభ్యులు బి రాజారావు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

యుటిఎఫ్ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గౌరవాధ్యక్షునిగా ఎన్ ప్రభాకర్‌రావు, అధ్యక్షుడిగా బి కనకారావు, సభాధ్యక్షులుగా ఎండి షౌకత్ హుస్సేన్, సహాధ్యక్షులుగా జయ ఝాన్సీ, ప్రధాన కార్యదర్శిగా జయలేని బాబు, కోశాధికారిగా ఎం వరప్రసాద్, కార్యదర్శులుగా బిజి గోపాలకృష్ణ, ఎస్ వెంకటేశ్వరరావు, టి.సీతారామయ్య, అబ్దుల్ హబీబ్, ఎల్ సుభాషిని, వీరబాబు, టి నాగేశ్వరరావు, ఎవి వరలక్ష్మి, ఎం జోగిరాజు, సిహెచ్ రాజా, శ్రీధర్, ఎల్ నరేంద్ర, రాష్ట్ర కౌన్సిలర్స్ ప్రతిపాదనలలో జై.లెనిన్‌బాబు, బి.కనకారావు పి ప్రసాద్ రావు, కె.భగీరథ, బి.వీరస్వామి, సిహెచ్ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

## మోడీని గద్దె దింపాలి

హక్కులను సాధించుకోగలమన్నారు. ఐఎన్‌టియుసి నాయకులు అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అనుసరించే మోడీని గద్దెదించి ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయ్ ఎస్.ధనుంజయరావు మాట్లాడుతూ మోడీ పాలనలో పెన్షనర్లపైనా భారాలు మోపారన్నారు. శ్రామిక మహిళా కన్వీనర్ ధనశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించేందుకు నిరాకరిస్తూ పిఎం కిసాన్ పథకానికి దూరం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన కౌలు చట్టం భూ యజమానులకు లాభం చేసేదిగా ఉందన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఎపి ఎన్జీవో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అర్‌హెచ్ ప్రకాష్, పోస్టల్ జిడిఎస్ డివిజన్ అధ్యక్షులు రామకృష్ణ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కె.శర్మ, ఎల్ఐసి ఉద్యోగుల డివిజన్ సహాయ కార్యదర్శి టి.చంద్రపాల్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వాకా రామచంద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ నారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు, త్రిమూర్తి గంగాధర్‌రావు, సిఐటియు మచిలీపట్నం కార్యదర్శి సిహెచ్ జయరావు తదితరులు పాల్గొన్నారు.

**దావా సమన్లు**
**మహారాజశ్రీ విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**O.S.No.549/2022**

Between:
తాళ్ళ సత్యనారాయణరెడ్డి ...వాది
మరియు
1)బురదగుంట రవి బాబు
2)గోళ్ళ కిషోర్
3)పాల్తియ రాము ...ప్రతివాదులు

To
బురదగుంట రవి బాబు, తండ్రి బురదగుంట ఏడుకొండలు, రైల్వే ట్రాక్ మ్యాన్, యమ్.పి.గ్యాంగ్, యస్.యస్.ఇ. పి.డబ్ల్యు.ఎ.వై., కొండపల్లి-521228, యన్.టి.ఆర్.జిల్లా. - **ప్రతివాది-1**
గోళ్ళ కిషోర్, తండ్రి గోళ్ళ నరసయ్య, రైల్వే ట్రాక్ మ్యాన్,యూనిట్-5, చెరువు మాధవరం స్టేషన్, యస్.యస్.ఇ. పి.డబ్ల్యు.ఎ.వై., కొండపల్లి-521228, యన్.టి.ఆర్.జిల్లా. - **ప్రతివాది-2**
పాల్తియ రాము, తండ్రి పాల్తియ గోపియ, అసిస్టెంట్ మ్యాత్స్ టీచర్, జడ్.పి.బాయ్స్ హైస్కూల్, జగ్గయ్యపేట - 521175, యన్.టి.ఆర్.జిల్లా.- **ప్రతివాది-3**

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా- పై నంబరు గల దావాను వాది మీపై మనీ రికవరీ నిమిత్తం పై కోర్టులో దాఖలు చేసియుండగా ఎన్ని పర్యాయములు మీకు సమన్లు పంపిననూ మీరు తీసుకొనుటలేదనియూ, అందువలన ఈ ప్రకటన ద్వారా మీకు పైదావాలో మీ హాజరు నిమిత్తం ది.23-11-2023 కు కోర్టువారు వాయిదా వేసి యున్నారు. పై తేదీన ఉదయం 10-30 గం.లకు మీరుగానీ, మీ తరపున న్యాయవాదిగానీ పైకోర్టునందు హాజరుపడి పై దావాలో మీకు ఆక్షేపణలు ఏమైనా వున్నయెడల తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షములో విచారించి తగు ఉత్తర్వులు జారీచేయ బడునని ఇందుమూలముగా పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వులతో)**
వాయిదా:23-11-2023

**ఇట్లు**
**కరిణి చంటిరాజు, బి.కాం., బి.యల్.**
**వాది తరపున న్యాయవాది, విజయవాడ,**
**మొబైల్ నెం.98480 91660**

**IN THE COURT OF THE HON'BLE IV ADDL. JUNIOR CUM METROPOLITAN MAGISTRATE AT VIJAYAWADA**
**O.S.No.119/2023**

Between:
Polurothu Sambasiva Rao ... Plaintiff
V/s
Kurakula Srinu .... Defendent
To,
Defendent:
Kurakula Srinu @ Srinivasa Rao, S/o. Tirupathi Rao @ Tirupathaiah, Hindu, aged about 27 years, Railway Employee, R/o. D.No. 9-74-4, Tammina Vari Street, Near Komala Vilas backside, Kothapet, Vijayawada-1, Krishna Dist.

పై నెంబరు దావా నందు శ్రీ కోర్టు వారి అందు వాది మీ పై దావా దాఖలు చేసి శ్రీ కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు మీకు సమన్లు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు ది.28-11-2023వ తేదీ ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలసినది అని లేనియెడల మీ పరోక్షము నందు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

**వాయిదా తేది: 28-11-2023**
**/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///**
**సంపర దుర్గా శ్రీనివాసరావు,**
వాది తరపు న్యాయవాది, విజయవాడ

**IN THE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA**
**I.P.NO.38/2023**

Between: Naganaboyena @ Nagaboyena Venkata Krishna Rao ... Petitioner / Creditor
**AND**
1. Kundeti Bala Subramanyeswara Rao, S/o. Nancharaiya, R/o. D.No.5-270, LIC Colony, 3rd Line, Kanuru Village, Vijayawada Rural, NTR Dist.
2. Dokka Vera Venkateswara Rao, S/o Yedukondalu, R/o. Punadipadu Village, Kankipadu Mandal. .... Respondents

పైన పేర్కొనబడిన Creditor I.P. నందు Petitioner / Creditor నాగబోయిన వెంకట కృష్ణారావు గారు ఎన్ని పర్యాయములు సమన్లు పంపిన రెస్పాండెంట్స్ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా ది.11-12-2023వ తారీఖున మీ ఇరువురు రెస్పాండెంట్స్ మీరు గానీ, మీ వకీలు ద్వారా గానీ ఉదయం గం.10.30 ని.లకు కోర్టుకు హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలుపవలసి యున్నది. లేనియెడల పరోక్షముగా తీర్మానించెదరు.

**పి. శ్రీరాజేష్ కుమార్,**
**ఎ.చంటిబాబు, పి.వి.వెంకటరాజు** అడ్వకేట్స్
విజయవాడ. సెల్: 9866351818

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
సోమవారం 20 నవంబర్ 2023

నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ రమేష్‌బాబు

## దివిసీమ ఘటన బాధాకరం : ఎంఎల్ఎ

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** దివిసీమలో 1977 నవంబర్ 19 సంభవించిన ఉప్పెనగోరకలి దివిసీమ చరిత్రలో మర్చిపోలేని ఒక పీడకలఅని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు విచారం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పులిగడ్డ వద్ద నిర్మించిన ఉప్పెన మతుల పైలాన్ వద్ద ఆదివారం మతులకు ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రకతి విపత్తుల సమయంలో జిల్లాలో ఎక్కువ నష్టపోయేది అవనిగడ్డ నియోజకవర్గమేనని అన్నారు. సముద్ర తీర ప్రాంతంలో ఉండటం వల్ల తరచూ నియోజకవర్గ విపత్తులను ఎదుర్కోవాల్సి న పరిస్థితి నెలకొంది అన్నారు. ఈ కార్యక్రమంలో టివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పులిగడ్డ అవనిగడ్డ సర్పంచులు దాసరి విజయ్ కుమార్ గోరుముచ్చు ఉమా పాల్గొన్నారు

# వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సన్మానం

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలోని గరికపర్రు కొమ్మమూరు గ్రామాల్లో చదువుకుంటూ వివిధ రంగాల్లో అత్యధిక ప్రతిభ కనబరిచిన నలుగురిని బి.వి.ఆర్ యూత్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించి,ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. బివిఆర్ యూత్ గౌరవ అధ్యక్షులు పొట్లూరి గోపాలకష్ణమూర్తి (బేబీ రావు) అధ్యక్షులు జలధర శ్యామ్, నడకుదురు రాజేంద్ర,బి.వి.ఆర్ యూత్ సభ్యులు వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన నలుగురికి శాలువాలు కప్పి, బొకేలతో, ప్రోత్సాహక నగదు ఇచ్చి సన్మానించారు. గరికపర్రు గ్రామానికి చెందిన చౌటపల్లి చిరంజీవి మైక్రో విభాగ బయాలజీ పరిశోధకుడిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టర్ రేటు సాధించాడు. గ్రామానికి చెందిన ఉయ్యూరు విక్రమ సింహ, ఉయ్యూరు చక్రిలు 21వ ఆంధ్రప్రదేశ్ టైక్వాండో (మార్షల్ ఆర్ట్స్ )లో గోల్డ్ మెడలో సాధించారు. కొమ్మమూరు గ్రామానికి చెందిన చింతలపూడి హారిక ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ నుంచి మహిళా క్రీడాకారిణిగా గుర్తింపు పొంది నేషనల్ కు అర్హత సాధించిన సందర్భంగా గ్రామంలో సన్మాన సభ ఏర్పాటు చేసి నలుగురిని

ఘనంగా సత్కరించారు. మండల జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి, పమిడిముక్కల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.కిషోర్ బాబు ఈ సన్మాన సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు తల్లిదండ్రులకు , గ్రామస్తులకు మంచి పేరు తెచ్చిన వీరిని అభినందించారు. ప్రోత్సాహక బహుమతులను అందజేసిన బి.వి.ఆర్ యూత్ ను అభినందించారు. వివిధ గ్రామాల్లోని యువత వీరిని ఆదర్శంగా తీసుకుని సమాజానికి మంచి పేరు తీసుకు రావాలని వీరి బాటలో నడిచి చదువు శ్రద్ధలతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలని వారు సూచించారు.

## నేడు కలెక్టరేట్లో 'స్పందన'

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** కష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.అలాగే డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహి స్తారని, ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయి లోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు

# కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

**ప్రజాశక్తిలి-చల్లపల్లి :** చల్లపల్లి శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం మహిళలకు రంగ వల్లుల పోటీలు నిర్వహించారు. సచివాలయం కానిస్టేబుల్ సరళ దిశా వ్యాప్పై గురించి విద్యార్థి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రంగవల్లుల పోటీలలో ఎస్ ఆర్ వై ఎస్ ఆర్ పి పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి పొందారు. గహిణి యు.రాజకుమారి రెండవ బహుమతికి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాన్ని లక్ష్మీపురం గ్రంథాలయాధికారి టి రాంబాబు , చల్లపల్లి గ్రంథాలయాధికారి గ్రంథాలయ అధికారి కె. గణేష్ కుమార్ లు పర్యవేక్షించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక గ్రంథాలయం వద్ద మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి లక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దిశ యాప్ ఉపయోగాల గురించి మహిళా పోలీస్ సుమతి విద్యార్థులకు వివరించారు. అనంతరం రంగవల్లుల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాల అధికారిని టి వాని తెలిపారు.**ప్రజాశక్తి-గన్నవరం :** మహిళా సాధికారతకు అందరూ సమిష్టిగా పోరాడవలసిన అవశ్యకత ఎంతైనా ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజ బెత్ రాణి అన్నారు. ఆదివారం గన్నవరం గ్రేడ్1 గ్రంథాలయంలో కమిటీ చైర్మన్ నర్రా సీతారామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్త్రీలు విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, సమాన హెూదా పురుషులతో సమానంగా సాధించకుండా దేశం అభివద్ధి పథంలో నడవటం సాధ్యం కాదన్నారు. గ్రంథాలయ కమిటీ మెంబర్ గన్నే వెంకట్రావ్, జిల్లా పరిషత్ బాలుర పాటశాల ప్రధాన ఉపాధ్యాయురాలు గంగాభవానీ, గ్రంథాలయ కమిటీ మెంబర్లు చిమాటరామారావు, పరిమి కోటేశ్వరరావు పాల్గొన్నారు.**ప్రజాశక్తి - గుడివాడ :** సమాజంలో స్త్రీలు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంతో మానసిక ధైర్యం, కఠోర శ్రమ ఉండటమే లక్ష్యసాధనకు మార్గమని ఎక్సైజ్ సీఐ నాగమణి అన్నారు. ఆదివారం స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎస్కే షమీ రాఘవాచారి గ్రంథాలయాధికారి బేరం వెంకటరమణ తెలుగు భాష వికాస సమితి అధ్యక్షుడు డిఆర్బి ప్రసాద్, మోకా మాధవరావు, వసుధ బసవేశ్వర రావు, దుగ్గిరాల ఆనందమోహన్ బోస్, గ్రంథాలయ సిబ్బంది టీ ప్రవల్లిక, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉంగుటూరు :** ఉంగుటూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి గ్రందాలయ అధికారి ఉప్పలపాటి చంద్రశేఖర రావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పర్యవేక్షకురాలిగా జయరామ విజ్ఞాన విహార్ ఇంగ్లీష్ మీడియం స్కూలు ఉపాధ్యాయ రాలు ఏ అనురాధ వ్యవహరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అనిత పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** విద్యార్థులకు చదువులోనే కాకుండా వివిధ అంశాలపై నైపుణ్యత అవసరం అని కోడూరు మండల గ్రంథాలయ అధికారిని వై పుష్పలత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం కోడూరు గ్రంథాలయ కార్యాలయం వద్ద బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో ప్రతిభను కనపరిచిన విద్యార్థులను విజేతలగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పమిడిముక్కల :** విద్యార్థి దశ నుండి గ్రంథాలయాలు పట్ల ఆదరణ పెట్టుకోవాలని కపిలేశ్వరపురం గంగారాయశాఖ అధికార వెనిగళ్ళ ప్రతాప్ అన్నారు. మండలంలోని పమిడిముక్కలలో షరీఫ్, మేడూరులో సుబ్రహ్మణ్యం, ఆగ్నిపర్‌లో గ్రంథాలయ శాఖలో బొబ్బ లావణ్య, పెనుముచ్చ గ్రంథాలయ శాఖలో వెంకట సుబ్బారావు కార్యక్రమాలను నిర్వహించారు. **ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ :** మహిళా సాధికారికతతో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని కూడా పాలించగలరని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నేటిమహిళలకు స్ఫూర్తి అని గ్రంథాలయ అధికారి స్వర్ణలతాదేవి అన్నారు. వీరవల్లి గ్రంథాలయ ఆవరణలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ హెచ్ఎం ఉషారాణి, నందమూరి బాబూరావు, మద్దాల హేమలత, ముదునూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని ఆదివారం బాలికలకు ము గ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి వార్డు కౌన్సి లర్ కోరాడా వెంకటలక్ష్మి, 7వ వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి టి. ఝాన్సీ రాణి, సంఘసేవకురాలు ఆర్. వీరకుమారి పూలమాలవేసి నివాళులర్పించి ము గ్గులపోటీలు ప్రారంభించారు. మహిళా సాధికారిత, దిశ చట్టంపై బాలికలకు వీరకుమారి అవగాహన కల్పించారు. 15 మంది విద్యార్థినులను గ్రంథాలయంలో ధరావతు దారులుగా చేర్పించారు. గ్రంథాలయ అధికారి బి.రమణి, సిబ్బంది పర్యవేక్షించారు.**ప్రజాశక్తి-పెదపారుపూడి :** ఓర్పు సహనం కలిగి మహిళలు పట్టుదలతో కషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని గ్రంథాలయాధికారిని ఎంవీఎస్ లక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రంథాలయంలో మహిళాదినోత్సవం సందర్భంగా మాజీ ప్రధానమంత్రి, భారతరత్న ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సచివాలయ మహిళా పోలీస్ ఆధ్వర్యంలో మహిళలకు రక్షణగా ఉన్న "దిశ చట్టం"మీద అవగాహన కల్పించారు. అనంతరం గ్రంథపాలకురాలు యంవియస్ లక్ష్మి ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు గారపాటి పద్మజారాణి , చెరుకూరి ప్రమీలాదేవి, ఉప్పలపాటి భాగ్యలక్ష్మీ, పూనుకొల్లు లక్ష్మీ, పొట్లూరి హేమలత, పాల్గొన్నారు. అలాగే యలమర్రు గ్రంథాల యం అధికారి పి రవిచంద్ర వెంట్రప్రగడ గ్రంథాల యంలో కూడా కార్యక్రమాలు నిర్వహించారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మహిళలు అన్ని రంగాల్లో ముందుండి క్రియాశీలక పాత్ర పోషించడం ద్వారా కుటుంబ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా ఉండగలరని మోపిదేవి గ్రంథాలయ శాఖ అధికారి సుధీర్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళల అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు దిశ చట్టంపై అవగాహన ఈ కార్యక్రమంలో రావి జోష్ణ డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు



గుడివాడలో...

పెదపారుపూడిలో...

## రామకృష్ణాపురంలో అభివృద్ధి శూన్యం : బుద్ధప్రసాద్

**ప్రజాశక్తి-కోడూరు :** వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 1977 ఉప్పెన తుఫానుకు ముందు ఉన్న పరిస్థితి నేడు రామకృష్ణాపురంలో కనిపిస్తుందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం కోడూరు మండలం పరిధిలోని రామకష్ణాపురం లో ఏర్పాటుచేసిన దివిసీమ ఉప్పెన స్మారక దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కష్ణాజిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకష్ణ విచ్చేసారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ఒక్క సైక్లోన్ షెల్టర్ కూడా కట్టించలేదని, రామకష్ణాపురంలో సచివాలయం, ఆర్.బి కె కేంద్రం నిర్మాణం కూడా పూర్తిచే యలేదన్నారు. 1977 తర్వాత రామకష్ణాపురంలో అభివద్ధి లేదనటానికి ముళ్ళ చెట్లతో నిండిన సచివాలయ భవన నిర్మాణాలే నిదర్శనం అన్నారు. సముద్రకట్ట శిథిలమైతే పట్టించుకున్న పరిస్థితి లేదని, త్రాగునీటి సమస్య పరిష్కరించలేదన్నారు. రామకష్ణాపురం పంచాయతీలో ఆలస్యంగా నాట్లు వేయడం వలన జనవరి నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాల్సి ఉంటుందని, కానీ సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం ప్రకటించడం బాధాకరం అన్నారు. గతంలో పంట వేసుకోలేని రైతాంగానికి నష్టపరిహారం కూడా ఇవ్వలేదన్నారు. దివిసీమ తీరప్రాంత గ్రామాల దైన్య స్థితికి రామకష్ణాపురం అద్దంపడుతుందని బుద్ధప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంచుల పంపిణీ

**ప్రజాశక్తి - మొవ్వ :** 2023 సంవత్సర ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం 52,000 వేల గోనె సంచులను విడుదల చేసినట్లు తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ వెల్లడి చేశారు. వీటిని అయ్యంకి,పెడసనగల్లు కాజలలోని కొనుగోలు కేంద్రాలకు 10 వేల చొప్పున భట్లపెనుమర్రు ధాన్యం కొనుగోలు కేంద్రానికి15 వేలు, కోసూరు కేంద్రానికి 5 వేలు, కూచిపూడి కోఆపరేటివ్ సొసైటీలో గల కొనుగోలు కేంద్రానికి 2050 సంచులు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు ఏ విధంగానైనా ఇబ్బందులు పడకుండా ముందస్తుగానే సంచులను కేటాయించామని, మిగిలిన కేంద్రాలు కూడా త్వరలో విడుదలవుతాయని ఆయన వెల్లడించారు. గతంలో మాదిరిగా కాకుండా పామర్రు ఎమ్మెల్సీ పాయింట్లో కొనుగోలు సంచులు సిద్ధంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. మండలంలోని 21 గ్రామాలలో గల 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు జరుగుతాయని వివరించారు. ఇదిలా ఉండగా ఉయ్యూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ దాసిరాజు, తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్ లతో కలిసి కూచిపూడి కేంద్రంలోని డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉప్పలపు రూపేష్ బాబు, టెక్నికల్ అసిస్టెంట్ ఉప్పలపు హేమంత్.ల ద్వారా విడుదలైన గోనే సంచులు, కొనుగోలుకు అవసరమైన పరికరాలు తదితర అంశాలపై శనివారం ఆరా తీశారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ :** ఉక్కు మహిళ మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ 106 వ జయంతిని పురస్కరించుకుని కష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పట్టాభి భవనం మచిలీపట్నం నందు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ నాయకులు అబ్దుల్ మతీన్, సీనియర్ నాయకుల కోక ఫణి భూషణ్, నల్ల బోలు కుమారి ,రజియా సుల్తానా ,చిలుకోటి ప్రసాద్, కొడమంచలి చంద్రశేఖర్ ,అఖ్తర్ అమ్మాజీ ,కళ్ళు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## లింగమనేని లీలావతికి నివాళి

**ప్రజాశక్తి-పమిడిముక్కల :** పమిడిముక్కల మండలం హనుమంతపురం గ్రామంలో లింగమనేని బాబురావు తల్లి లింగమనేని లీలావతి పెద్దకర్మ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. బాబు రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి మండల నాయకులు మోటూరి వెంకటసుబ్బయ్య, లింగమనేని రామారావు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# దుర్గగుడిలో సుబ్రమ్మణ్యస్వామి కళ్యాణం

సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణంలో యాత్రికులు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్ర కీలాద్రి దుర్గమ్మ దేవ స్థానంలో ఆదివారం షష్ఠి సందర్భంగా (ప్రతి నెలా షష్ఠి రోజున జరుపు) దేవస్థానంలో జరుపు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. షష్ఠి సందర్భంగా భక్తులు సుబ్రమణ్య స్వామి వారి కల్యాణాన్ని భక్తులు విశేషంగా తిలకించారు. ఆదివారం సందర్భంగా యాత్రికులు విశేష సంఖ్యలో విచ్చేసి, నిత్య ఆర్జిత సేవలైన శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీ హోమం, శాంతికళ్యాణంలో పాల్గొని, శ్రీ అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రాపర్టీ షోలో హాజరైన బ్యాంకు సిబ్బంది

# ఇండియన్ బ్యాంక్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** సత్యనారాయణపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో రెండు రోజుల నుండి ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రాపర్టీ ఎగ్జిబిషన్ ఆదివారం నాటితో ముగిసింది. ఈ ప్రదర్శనకు మంచి స్పందన లభించిందని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ వి.వి.ఆర్.కె.సుబ్రహ్మణ్యం అన్నారు. ఇండియన్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఏడు జోన్ల పరిధిలో ఉన్న నిరర్థక ఆస్తుల ఎగ్జిబిషన్‌ను నిర్వహించామన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో రు. 719.42 కోట్ల విలువ చేసే ప్రాపర్టీలు, మొత్తం 184 ప్రదర్శనకు ఉంచారని అన్నారు. ఈఆస్తుల వేలం నవంబరు, డిసెంబరు నెలల్లో నిర్వహిస్తామని అన్నారు.

# ఐరన్ మెష్‌ను సరిచేయరూ..

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** కబేళా రోడ్డు నుండి చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ వెళ్లు మార్గ మధ్యంలో గల కల్వర్ట్‌పై ఉన్న ఐరన్ మెష్ కుంగిపోయి ప్రమాదభరితంగా తయారైంది. వివరాల్లోకి వెళ్తే పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్ కబేళా రోడ్డు నుండి చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్‌కు వెళ్తు ప్రధాన రహదారిపైన గల కల్వర్ట్ (డ్రైన్)పై ఏర్పాటు చేసిన ఐరన్ మెష్ చుట్టు ఉన్న సిమెంట్ దిమ్మెలు పగిలిపోయి మెష్ పక్కకు కుంగిపోయి ప్రమాద భరితంగా మారింది. నగరపాలక సంస్థ అధికారులు కల్వర్‌పై పెద్ద దిమ్మెలతో పాటు కొంతమేర ఐరన్ మెష్ ఏర్పాటు చేశారు. డ్రైన్‌లో ఉన్న చెత్తా చెదారం తొలగింపు కోసం నగరపాలక సంస్థ అధికారులు డ్రైన్‌పై ఇనుప మెష్ వేశారు. సిబ్బంది మెష్‌ను పైకి తీసి చెత్త తొలగిస్తుంటారు. అయితే సంబంధిత మెష్ చుట్టు వేసిన సిమెంట్ దిమ్మె పగిలిపోవటమే గాక అటుగా భారీ వాహనాలు, టిప్పర్లు, లారీలు రాకపోకలతో ఐరన్ మెష్ కుంగిపోయింది. దీనివల్ల రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ఆ కల్వర్ట్‌లో పడి ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కల్వర్ప్‌పై కుంగిన ఐరన్ మెష్‌ను సరిచేయాలని కోరుతున్నారు.

కల్వర్ట్‌పై కుంగి ప్రమాదభరితంగా ఉన్న ఐరన్ మెష్

# వైద్యుల సేవలు గ్రామాలకూ విస్తరించాలి : వెంకయ్యనాయుడు

హాస్పటల్‌ని ప్రారంభించిన వెంకయ్య నాయుడు

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** అత్యాధునికంగా నిర్మించిన పి.వి.ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్‌ను ఆదివారం మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో తనదైన శైలిలో ఎందరికో విస్తృతమైన వైద్య సేవలు అందించిన డాక్టర్ పి.వెంకట్ రామ్ చౌదరి నేతత్వంలో నగరం లోని పటమట సోనోవిజన్ సమీపంలో ఈ హాస్పటల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మీడియాతో మాట్లాడుతూ, వైద్య రంగానికి విజయవాడకు ఎనలేని సంబంధ ఉందని, అన్ని రకాల వైద్య సేవలను అందించడం నగరానికే గర్వకారణమని అన్నారు. యువకుడైన డాక్టర్ పి.వెంకట్ రామ్ చౌదరి నేతత్వంలో పేదలకు, గ్రామీణ ప్రాంతాలకు తమ వైద్య సేవలు మరింతగా విస్తరించాలని సూచించారు. డాక్టర్ పి.వెంకట్ రామ్ చౌదరిని అభినందించారు. డాక్టర్ పి.వెంకట్ రామ్ చౌదరి మాట్లాడుతూ విజయవాడ మహానగరం దినదినాభి వృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆర్థో, జనరల్ మెడిసిన్ , గైనకాలజీ, పల్మనాలజీ, యూరాలజీ వంటి చికిత్స లకు అత్యాధునిక వైద్య సేవలు లభించేలా ఈ హాస్పటల్ నిర్మించా మని తెలిపారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ స్టేట్ మీడియా ఇంచార్జ్ పాతూరి నాగభూషణం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బిజెపి నేత, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్, తదితరులు డాక్టర్ రామ్ చౌదరిని అభినందించారు.

# భవానీపురంలో ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన

పాటలతో అలరిస్తున్న సినీ నటుడు సాయి కిరణ్ తదితరులు

కార్తీక వన సమారాధన భోజనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

**ప్రజాశక్తి - భవానీపురం :** అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో భవానీపురం పున్నమి ఘాట్ వద్ద గల బబ్బూరి గ్రౌండ్స్ కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్య సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంగరంగా వైభవంగా నిర్వహించిన ఆర్యవైశ్య సమ్మేళనం కార్తీక మాస వన సమారాధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, పశ్చిమ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ శాసన సభ్యులు మల్లాది విష్ణు, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లపోతు మురళీకష్ణ (కొండపల్లి బుజ్జి), ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్, స్టాండింగ్ కమిటీ సభ్యులు గుడివాడ నరేంద్ర పాల్గొని కార్తీక వన సమారాధన భోజనాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సినీ హీరో సాయి కిరణ్ తదితరులు వివిధ పాటలు పాడి పలువురిని ఆకట్టుకున్నారు. కార్తీక వన భోజనాల్లో పాల్గొన్న పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# క్రికెట్ వీక్షించేందుకు భారీ ఎల్ఇడి స్క్రీన్‌లు

**ప్రజాశక్తి - నందిగామ :** ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా వరల్డ్ కప్ మ్యాచ్ క్రికెట్ అభిమానుల కోసం నందిగామ జడ్పీ పాఠశాలలో ఆదివారం భారీ ఎల్.ఈ.డి స్క్రీన్ నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్‌రావు ఏర్పాటు చేశారు. ఎల్.ఈ.డి స్క్రీన్‌లో లైవ్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ ఎత్తున క్రికెట్ అభిమానులు, విద్యార్థులు తరలివచ్చారు. ఇండియా జట్టు వరల్డ్ కప్ సాధించాలని, భారతీయ ఖ్యాతిని ప్రపంచానికి చాటేలా ఫైనల్ మ్యాచ్ గెలవాలని ఎంఎల్ఎ కోరుకుంటున్నానన్నారు. స్క్రీన్ల ఏర్పాటుపై అభిమానులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం ఐశ్వర్య గ్రాండ్ అపార్ట్‌మెంట్ల మధ్య భారీ ఎల్ఇడి స్క్రీన్

విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో...

## టీమ్ ఇండియా గెలుపుకోసం జాతీయ పతాకంతో ప్రదర్శన

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా గెలుపును కాంక్షిస్తూ "కమాన్ ఇండియా' అంటూ ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ జాతీయ పతాకంతో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. కేబీఎన్ కాలేజీ వద్ద నుండి నెహ్రూ బొమ్మ సెంటర్ మీదగా చిట్టినగర్ నుండి తిరిగి కేబీఎన్ కాలేజీ వరకు ప్రదర్శన సాగింది. ప్రదర్శనలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, నగర నాయకులు సాయి కుమార్, అయ్యప్ప, చందు, ఎఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల భార్గవ్, లంకా గోవింద రాజులు, ఎస్. మోహన్ కుమార్ పాల్గొన్నారు.

## ఇండియా గెలుపును కాంక్షిస్తూ నమూనా కప్‌తో ర్యాలీ

టీమ్ ఇండియా విజయాన్ని కాంక్షిస్తూ చార్టెడ్ అకౌంట్ ముదిలి విజయకష్ణ అండ్ కో వారి ఆధ్వర్యంలో ప్రపంచ కప్ నమూనాతో వన్‌టౌన్ రాయల్ హోటల్ సెంటర్ నుంచి కాళేశ్వరరావు మార్కెట్ మీదగా చిట్టినగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ స్టాండింగ్ కమిటీ సభ్యులు, 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ హాజరై ర్యాలీ ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ యావత్ భారతదేశం ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూస్తున్న సమయం భారత్ మూడో వరల్డ్ కప్‌ను తేవాలని కోరుకుంటూ ఈ ర్యాలీ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంట్ ముదిలి విజయ్ కృష్ణ, ముదిలి నగేష్, బాయన వరప్రసాద్, గురుమహంతు శివాజి ఇతర సభ్యులు పాల్గొన్నారు. **విజయవాడ అర్బన్ :** వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ నగర వాసులలు తిలకించేందుకుగాను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో పెద్ద స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. భారత్ – ఆస్ట్రేలియా మ్యాచ్‌ను తిలకించేందుకుగానూ పెద్ద సంఖ్యలో నగర వాసులు స్టేడియంకు చేరుకోవడంతో స్టేడియం అంతా సందడిగానూ కిక్కిరిసిపోయింది.

వన్‌టౌన్‌లో వరల్డ్‌కప్ నమూనాతో ర్యాలీ, జాతీయ పతాకంతో ప్రదర్శన

మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

# సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి వత్సవాయి :** ఈ నెల 24న జగ్గయ్యపేటలో జరగనున్న సామాజిక సాధికారయాత్రను నియోజకవర్గ ప్రజలంతా భారీగా తరలి వచ్చి సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. మండల వైసిపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, కార్యకర్తలతో రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో 51 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ఘనత దేశంలో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ఇంటీరియర్ షాపును ప్రారంభిస్తున్న సౌమ్య

# ఇంటీరియర్స్ షాపు ప్రారంభం

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ రైతుపేట హీరో షోరూం పక్కన నూతనంగా ఏర్పాటు చేయబడిన ఆశ్రిత ఇంటీరియర్స్ షాపును ఆదివారం మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. పట్టణ టిడిపి కౌన్సిలర్లు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఆశ్రిత ఇంటీరియర్స్ యాజమాన్యం వారికి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

# స్క్రీనింగ్ పరీక్షతో ఊపిరితిత్తుల కేన్సర్ గుర్తించొచ్చు

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** ఊపిరితిత్తుల క్యాన్సర్ అనేది ఊపిరితిత్తుల కణాలలో మొదలయ్యే ఒక రకమైన క్యాన్సర్ అని అత్యంత సాధారణమైన క్యాన్సర్ రకాల్లో ఒకటని ముందుగా గుర్తించి చికిత్స చేస్తే ఎటువంటి ప్రమాదం ఉండదని హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ కె.పి.రంగ నాథ్ అన్నారు. నగరంలోని హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్‌లో ఆదివారం అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ధూమపానం ప్రధాన కారణం అయినప్పటికీ ధూమపానం చేయనివారు కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడతారన్నారు. అయితే ముందుగానే స్క్రీనింగ్ ద్వారా గుర్తించి చికిత్స అందిస్తే సాధారణ వ్యక్తులుగా జీవితం గడపవచ్చని అన్నారు. ధూమపాన చరిత్ర అంటే గత ఇరవై సంవత్సరాలుగా ఒక ప్యాకెట్ సిగరెట్ తాగినా లేదా ఇటీవల పదిహేనేళ్లలో మానేసిన ఎవరైనా హై రిస్క్ కేటగిరి కిందకు వస్తారన్నారు. అటువంటి వారికి స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించి తగిన విధంగా చికిత్స చేయాల్సి ఉంటుందన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్థంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.